క్లుప్తంగా

నగరంలో ఫుడ్‌బ్యాంక్‌లకు ఆదరణ



ఫుడ్‌బ్యాంక్‌లో అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: పేదల ఆకలిని తీర్చే ఫుడ్‌బ్యాంకులు అన్నదాన కేంద్రాలుగా అలరారుతున్నాయి. కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న ఫుడ్ బ్యాంక్ వద్ద పేదలకు శుక్రవారం ఆహారం అందజేశారు. పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ట్రస్ట్ అందిస్తున్న ఆహారాన్ని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతిరోజూ పేదలకు వడ్డిస్తూ సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో ఇప్పిలి శ్రీనివాసరావు, బలివాడ రవిశంకర్, నామాల సర్వేశ్వరరావు, వేముల శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై సాయినాథుడి ఆశీస్సులు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: షిర్డీ సాయినాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. నగరంలోని పద్మావతినగర్‌లో కొలువుదీరిన విజయ గణపతి, దత్తాత్రేయ సహిత శ్రీ సద్గురు సాయిబాబా దేవాలయం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని కోలగట్ల ప్రారంభించారు. అనంతరం బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, నాయకులు, నిర్వాహకులు గోల్డ్ శ్రీను, భార్గవ కుమార్, బైక్ రమేష్, గాంధీ, సూరి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చర్యలు ప్రజలకు తెలియజేస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విజయనగరం ఫూల్‌బాగ్: దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 14,15 తేదీల్లో భారత్ బచావో.. బీజేపీ హటావో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం స్థానిక అమర్‌భవన్‌లో సీపీఐ సమావేశం నిర్వహించి, పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి. కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు అశోక్, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



రాజారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో పలువురిని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తూ గాయపడిన ఎల్డుటి సత్యంను పరామర్శించి, రూ 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు అలమండ అప్పారావు, పల్లా సత్యనారాయణను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అలాగే కిడ్నీ సమస్యతో బాధపడుతూ స్థానిక మిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కనకల రాజారావును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఏ అవసరమైనా తనను సంప్రదించాలని, సహాయ సహకారాలు అందిస్తానని వారి కుటుంబ సభ్యులకు సూచించారు. ఎమ్మెల్సీ వెంట నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లి శ్రీను, తుమ్మ నారాయణమూర్తి, ఉషోదయా యూత్ అసోసియేషన్ ప్రతినిధి ఆరిపాక శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఆహార నియమాలతో ఆరోగ్యం పదిలం

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ మంచి ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యం కాపాడుకోవచ్చునని ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల పరిధి గార్రాజుచీపురుపల్లి సచివాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తీసుకుంటున్న ఆహారం, పని ఒత్తిడి కారణంగా అసంక్రమణ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.

ఏమ్మా.. పాలన ఎలా ఉంది..!

- సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా..
- ప్రజలతో మమేకమైన డిప్యూటీ స్పీకర్
- 'జగనన్నే మా భవిష్యత్..' కార్యక్రమాన్ని ప్రారంభించిన కోలగట్ల



విజయనగరం: కొత్తపేటలో ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయం తీసుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్లవీరభద్రస్వామి

విజయనగరం: 'ఏమ్మా మీకు పింఛన్ వస్తోందా.. చేయూత వచ్చిందా.. మీ పిల్లలకు అమ్మఒడి డబ్బులు పడ్డాయా.. పాఠశాలల రూపురేఖలు మారాయా.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందా.. జగన్ మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉంది..? మా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అందుబాటులో ఉంటున్నారా..? మళ్లీ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి మీ మద్దతు తెలపండి..' అంటూ డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నగరంలోని ఒకటో డివిజన్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను వివరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని..పింఛన్లు ఇంటికి తెచ్చి ఇస్తున్నారని వివరించారు. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజల అనుమతితో 'జగనన్నే మా భవిష్యత్' స్టిక్కర్లను ఆయా ఇళ్ల వద్ద కోలగట్ల అతికించారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే.. 82960 82960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు బంగారమ్మపేట ప్రచారంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: కొత్తపేటలో ఇంటి గోడపై స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నెల్లిమర్ల: బ్రోచర్‌ను అందజేస్తున్న గణేష్, తదితరులు

సంక్షేమ పథకాలు భేష్..

పూసపాటిరేగ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని రెల్లివలసలో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేసి దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలిచారన్నారు. రెల్లివలసలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, మహంతి శ్రీనివాసరావు.. పూసపాటిరేగలో జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, మహంతి జనార్దనరావు, మహంతి లక్ష్మణరావు.. చోడమ్మ అగ్రహారంలో వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు.. అల్లాడపాలెంలో వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్.. కొప్పెర్లలో పుప్పాల లక్ష్మీనారాయణ.. కోనాడలో దాడిశెట్టి త్రినాథరావు, బొడ్డు ఎల్లాజీ ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాలు నిర్వహించారు.



పూసపాటిరేగ: ఓ కిరాణాషాపు వద్ద మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న మహంతి జనార్దనరావు, తదితరులు



డెంకాడ: సింగవరంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు

జగనన్నే మా భవిష్యత్..

డెంకాడ: మండలంలోని నాతవలస, సింగవరం, డెంకాడ గ్రామాల్లో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాల్లో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం, ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అవగాహన కల్పించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ గౌరమ్మ, పిట్టా అప్పారావు, బమ్మిడి వెంకటరమణ, సంచాన కృష్ణమూర్తి, లెంక అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఎస్.గౌరి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15వ వార్డులో.

నెల్లిమర్ల: నగర పంచాయతీ థామస్‌పేట 15వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేశ్ ఆధ్వర్యంలో స్థానిక వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కాలనీలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు పైల చిరంజీవి, బోని మధు, గృహ సారథులు బూడి శ్రీనివాసరావు, పక్కి రమాకుమారి, వార్డు వలంటీర్ పైల రమాదేవి పాల్గొన్నారు.

శాంతి, సహనం పాటించాలి...

- పాస్టర్ అలజంగి రవికుమార్



నెల్లిమర్ల: క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ స్టీవెన్ రాజు



విజయనగరం టౌన్: ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ అలజంగి రవికుమార్ , తదితరులు

విజయనగరం టౌన్: క్రీస్తు బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ శాంతి, సహనం పాటించాలని ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. గుడ్ ఫ్రైడే వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. రవికుమార్ ఆధ్వర్యంలో ఏసు ప్రేమాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏసు శిలువ మరణం మానవాళి పాప విమోచనానికి దోహదపడిందన్నారు. పాపులను పునీతులను గావించేందుకే క్రీస్తు శిక్ష అనుభవించారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు నిర్వహించుకునే పండగల్లో శుభ శుక్రవారం ఎంతో ప్రముఖమైనదని తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, సత్య , విక్టర్‌బాబు, విన్స్టన్, నాగేశ్వరరావు, పాస్టర్ జాకబ్, అరుణ్ కుమార్, రవిబాబు, కాలేబు, నిరీక్షణ, మేరీ గ్రేస్‌లతో పాటూ క్రీస్తు ఆరాధకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆర్‌సీఎం, బాప్టిస్ట్, సిమ్స్, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో..

నెల్లిమర్ల: పట్టణానికి చెందిన క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ప్రధాన రహదారిలోనున్న పురాతనమైన తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ స్టీవెన్ రాజు ఆధ్వర్యంలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు రత్నకుమార్, విలియం ప్రసాద్, విలియమ్స్, ఇమ్మాన్యుయేలు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్వోబీ వద్దనున్న గాస్పల్ ఆఫ్ కింగ్‌డమ్ చర్చ్ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు పట్టణ ప్రధాన రహదారిలో శాంతి ర్యాలీ నిర్వహించారు.

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం

విజయనగరం టౌన్: పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని స్వామి కల్యాణాన్ని శుక్రవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితుడు పీవీ. నరసింహాచార్యుల సమక్షంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం అగ్ని ఆరాధన, సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని , స్వామివారిని దర్శించి తరించారు.



దేవేరులతో శ్రీనివాసుడు

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్

విజయనగరం: అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక కోట జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ డిస్ట్రిక్ట్ – 102 గవర్నర్ కర్రోతు సత్యం వైద్య పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలంతా ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వాసవి డయాగ్నోస్టిక్ టెక్నీషియన్ అభి సుమారు 60 మందిని పరీక్షించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు పప్పు విశ్వనాథం, ఓంకార మూర్తి, వై.నలమారాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల అడ్డగింత

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామం సిద్ధార్థనగర్ కాలనీ సమీపంలో అధికారులు చేపట్టిన కాలువ నిర్మాణ పనులను కాలనీ వాసులు అడ్డుకున్నారు. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ముంజేరు గ్రామంలో నివాసముంటున్న ప్రజల వాడుకనీరు ఆరు కాలువల ద్వారా బయటకు పోతోంది. ఇందులో ఓ కాలువ సిద్ధార్థనగర్ మీదుగా వెళ్తోంది. ఈ కాలువను పక్కాగా నిర్మించడానికి 2022 డిసెంబర్‌లో సుమారు రూ.4 లక్షల నిధులు మంజూరు చేస్తూ కాంట్రాక్ట్‌ను డ్వాక్రా మహిళకు అప్పగించారు. దీంతో ఆమె అప్పట్లో పనులు చేపట్టగా.. సిద్ధార్థనగర్ కాలనీవాసులు అడ్డుకున్నారు. వాడుకనీరు తమ ప్రాంతం మీదుగా వెళ్లడానికి వీల్లేదంటూ పనులను నిలిపివేశారు. అనంతరం గ్రామస్తులు పలుమార్లు కాలువ నిర్మాణం కోసం స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించగా.. అధికారుల సమక్షంలో కాంట్రాక్ట్ దక్కించుకున్న మహిళ శుక్రవారం మళ్లీ పనులు చేపట్టింది. దీంతో కాలనీవాసులు మళ్లీ పనులు అడ్డుకోవడంతో విషయాన్ని సదరు కాంట్రాక్టర్ పోలీసులకు తెలియజేసింది. వెంటనే ఎస్సైలు కృష్ణమూర్తి, సూర్యకుమారి గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వానికి సంబంధించిన రాస్తా భూమిలో కాలువ నిర్మాణం చేపడుతున్నామని, దీనివల్ల ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బంది ఉండవని అధికారులు కాలనీవాసులకు ఎంత నచ్చచెప్పిన వారు వినకపోవడంతో చేసేదిలేక అధికారులు వెనుదిరిగారు. పోలీస్‌బందోబస్తు మధ్య శనివారం పనులు చేపడతామని ఎంపీడీఓ దాసరి బంగారయ్య తెలిపారు.



కాలువ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న సిద్ధార్థనగర్ కాలనీ వాసులు

రూ. 50.40 లక్షలతో అభివృద్ధి పనులు

విజయనగరం: గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 1, 13 డివిజన్‌లలో 50.40 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఒకటో డివిజన్‌లోని నందిగొడ్డి, సాకేటివీధి, తదితర ప్రాంతాలలో పూర్తయిన రోడ్లను ప్రారంభించి, ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలో సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. శంకుస్థాపనలు చేయడమే కాకుండా ప్రారంభోత్సవాలను కూడా వెనువెంటనే చేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని చెప్పారు. గడిచిన వేసవికాలాలలో ప్రజలు ఎక్కడా తాగునీటి ఇబ్బందులు పడకుండా చూశామని, ఈ ఏడాది కూడా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నగరంలోని ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేశామని, ఇందులోభాగంగానే ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద దండి మార్చ్ విగ్రహావిష్కరణ చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో పాటు నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి ,డిప్యూటీ మేయర్ రేవతీదేవి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, దుబే, ముచ్చు శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్ ముచ్చు లయా యాదవ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కార్పొరేషన్ ఈఈ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

త్వరలో మహిళా పార్క్ ప్రారంభం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

నగరం నడిబొడ్డున మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కును త్వరలో ప్రారంభించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహిళా పార్క్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలో ఉన్న ప్రముఖ మహిళలతో కలసి పార్క్‌ను తిలకించారు. అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలే కమిటీగా ఏర్పడి పార్క్‌ను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూ టీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రైవేటీకరణ తగదు

విజయనగరం ఫూల్‌బాగ్:

విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక ఎన్‌పీఆర్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె. రమేష్, ఈశ్వరరావు, సత్యశ్రీనివాస్, ప్రసన్నకుమార్, భాస్కరరావు, ప్రసాదరావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు